==================================================================
Language in India www.languageinindia.com ISSN 1930-2940 Vol. 18:9 September 2018
India's Higher Education Authority UGC Approved List of Journals Serial Number 49042
============================================================

# An Analysis of Dialect in Telugu Translated Novels

Chaitanya AVVK, Ph.D. Research Scholar

==============================================================

**Abstract**

This article in Telugu focuses on the methods of Dialect Translation in Telugu Novels. In the first part, importance of dialect during the translation process is introduced.

In the second part, definition of Dialect and different dialects in various languages are discussed in brief. In the third part, reasons for the use of dialect in literature, the ways a translator could recognize the salient features of the dialect in a source language literature and dissimilarities in the use of dialect by Indian and Foreign writers are observed.

In the fourth part, views and methods of foreign research in translating the dialect are explained. In the fifth part, dialects used in translated Telugu novels and techniques used by the translators in dialect translation are analyzed.

# తెలుగు అనువాద నవలల్లో మాండలికం –విశ్లేషణ

**Telugu anuvāda navalallō māṇḍalikam – Viślēṣaṇa**

Chaitanya AVVK, Ph.D. Research Scholar

avvk.chaitanya@gmail.com

Department of Telugu, University of Hyderabad, Hyderabad

==================================================

**సంక్షిప్తి:**

ఈ పత్రం తెలుగు అనువాద నవలల్లో మాండలికాలను అనువదించిన తీరును వివరిస్తుంది. మొదటి విభాగంలో అనువాద సాహిత్యంలో మాండలిక ప్రాముఖ్యాన్ని పరిచయం చేయడం జరిగింది.

రెండవ విభాగంలో మాండలికాన్ని నిర్వచించి, భిన్న భాషలలో ఉన్న మాండలికాలను గురించి వివరించడమైంది.

మూడవ విభాగంలో సాహిత్యంలో మాండలికం వాడడానికిగల కారణాలను, మూల భాషా రచనలోని మాండలిక లక్షణాలను అనువాదకుడు ఏ విధంగా గుర్తించాలన్న అంశాలను, పాశ్చాత్య, భారతీయ రచయితలు మాండలికాలను వాడడంలోని భేదాలను విశ్లేషించడం జరిగింది.

నాలుగవ విభాగంలో మాండలిక అనువాదానికి సంబంధించి పాశ్చాత్య పరిశోధకులు చెప్పిన అనువాద విధానాలను వివరించడమైంది.

ఐదవ విభాగంలో తెలుగు అనువాద నవలల్లో కనిపించే మాండలికాలను వివరిస్తూ, ఆయా అనువాదకులు మాండలికాన్ని అనువదించిన తీరును విశ్లేషించడం జరిగింది.

## 1. పరిచయం:

"మూల భాష మాతృభాషగా గలవానికి మూల రచనలోని సారాంశం ఎంత స్పష్టంగా అర్థమై, ఎంత గాఢమైన అనుభూతిని కల్గిస్తుందో లక్ష్యభాష మాతృభాషగా గలవానికి అనువాదంలోని సారాంశం అంత స్పష్టంగానూ అర్థమై, అంత గాఢమైన అనుభూతిని కలిగిస్తే అది మంచి అనువాదం అవుతుంది"(రామచంద్రారెడ్డి, రాచమల్లు. 1992:71). రామ చంద్రా రెడ్డిగారు చెప్పిన ఈ అనుభూతి గాఢతను కలిగించడానికి తోడ్పడే ముఖ్యమైన అంశాలలో ఒకటి భాష. అనువాద రచనలో భాష ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా అందరికీ పరచయం ఉన్న రూపంలో ఉండాలి. అలా కాక మాండలిక భాషను అనువాదకుడు వాడినపుడు అనువాద రచన పఠనీయత(Readability)ను అది ప్రభావితం చేస్తుంది.

అటువంటప్పుడు అనువాదాలలో మాండలిక భాష వాడకాన్ని ఆమోదించవచ్చా అనే ప్రశ్న తలెత్తుతుంది. తెలుగు సంప్రదాయ సాహిత్యం (Main Stream Telugu Literature)లో కూడా మాండలిక భాష వాడకం విరివిగానే జరిగింది. పాత్రోచితం, సందర్భోచితం, ప్రాంతీయ చిత్రణల పేరుతో తెలుగు రచయితలు మాండలిక భాషను వాడారు. ఈ కారణాలను అనువాద సాహిత్యంలో మాండలిక భాష వాడకానికి అన్వయించుకోవచ్చా? ఒకవేళ అనువాదకుడు మాండలిక భాషను వాడినట్లయితే ఇతర ప్రాంతాలకు చెందిన పాఠకుల అవగాహన కోసం ఎటువంటి చర్యలు తీసుకోవాలి? మొత్తం మీద తెలుగు అనువాద సాహిత్యంలో మాండలిక భాష ఉపయోగించిన తీరును వివరిస్తూ, మాండలికాలను వాడడానికి గల సాధ్యాసాధ్యాలను ఈ పత్రం చర్చిస్తుంది. ఈ సందర్భంలో మాండలికం అంటే ఏమిటో కూడా పరిశీలించాలి.

## 2. మాండలికం నిర్వచనం – రకాలు:

1. "A language or manner of speaking peculiar to an individual or class or region" [ఒక వ్యక్తికి లేదా వర్గానికి లేదా ప్రాంతానికి పరిమితమైన భాష లేదా వ్యవహార వైవిధ్యం(Dictionary of Literary Terms & Literary Theory. 2015: 196)].

2. "A particular form of a language which is peculiar to a specific region or social group" [నిర్దిష్ట ప్రాంతానికి, లేదా సామాజిక వర్గానికి చెందిన ఒక ప్రత్యేకమైన భాషా రూపం (Oxford Dictionary)].

3. కాట్ ఫోర్డ్ మాండలికానికి తనదైన నిర్వచనాన్ని ఇచ్చాడు. "a language variety related to the performer's provenance or affiliations in a geographical, temporal or social dimension"[ ఒక వ్యక్తి పుట్టిన ప్రాంతం, లేదా అతనికి సంబంధించిన స్థలం, కాలం లేదా సామాజిక స్థితిగతుల వలన ఏర్పడే భాషా వైవిధ్యాన్ని మాండలికం అంటారు (Catford, J.C. 1978: :85)]. మాండలికానికి కాట్ ఫోర్డ్ "కాలం" అన్న కొత్త కోణాన్ని చేర్చారు. భాష పరిణామం చెందే క్రమంలో వివిధ కాలాల్లోని భాషా స్వరూపాలను ఈ 'సమయ మాండలికా'నికి(Temporal Dialect) ఉదాహరణగా చెప్పవచ్చు. ఉదా: తెలుగులో గ్రాంథిక, వ్యావహారిక భాషలు. మాండలికం అనడం వల్ల ప్రమాణ భాష వేరొకటి ఉందన్న భావన కలిగే అవకాశం ఉంది. నిజానికి భాషలో కనిపించే ప్రతి విభిన్న రూపమూ మండలికమే. అయితే ప్రచార, ప్రసార మాధ్యమాలు, విద్యా సంస్థలు, ప్రభుత్వాలు ఏ మాండలికాన్ని వాడుతున్నారో దానిని ప్రమాణ భాషగా చెబుతుంటారు. ప్రమాణ భాష అనడం ద్వారా ఇతర

మాండలికాలను తక్కువ చేసినట్టు కాదు. ఈ సమస్యకు సమాధానంగా ప్రమాణ భాషను ప్రమాణ మాండలికంగా గుర్తిస్తే మంచిది. అన్ని మాండలికాలు కలిస్తేనే భాష అన్న విషయం ఇక్కడ ప్రధానం. ప్రతి భాషలోనూ విభిన్న మాండలికాలు ఉంటాయి. తెలుగులో కళింగాంధ్ర, మధ్యాంధ్ర, రాయలసీమ, తెలంగాణ మాండలికాల విభజనను ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి చేసారు. ఇది స్థూల విభజన మాత్రమే. ఇందులో మళ్ళీ అనేక విభాగాలున్నాయి. అలాగే ఇంగ్లీషును ప్రధానంగా అమెరికన్ ఇంగ్లీషు, ఇంగ్లండు ఇంగ్లీషులుగా విభజిస్తారు. వీటిలో కూడా అనేక మాండలికాలు ఉన్నాయి. అమెరికన్ ఇంగ్లీషులో New York English, Coastal Southern English, Middle American, Inland North, North Central, and Western American English, అన్న మాండలికాలు ఉన్నాయి. ఇంగ్లండు ఇంగ్లీషులో North, East Midlands, West Midlands, South, West, Scottish, Ireland, Wales వంటి అనేక మాండలికాలు ఉన్నాయి. భారతదేశంలో దేశ భాషగా ఉన్న హిందీలో కూడా అనేక మాండలికాలు ఉన్నాయి. ఖడీబోలీ మాండలికాన్ని నేడు హిందీలో ప్రమాణ మాండలికంగా వాడుతున్నారు. ఇది కాక బ్రజ్, హర్యాణ్వీ, అవధి, బఘేలి, కన్నౌజి, చత్తీస్ ఘడి వంటి అనేక మాండలికాలు ఉన్నాయి.

## 3. సాహిత్యంలో మాండలికం:

న్యూమార్క్ అభిప్రాయం ప్రకారం రచనలో మాండలికాల వాడకానికి మూడు కారణాలు ఉంటాయి. ఒకటి భాషలో మాండలికం వాడకాన్ని చిత్రించాలి అనుకున్నపుడు, ప్రాంతీయంగా ఉన్న సాంఘిక అసమానతలను చిత్రించాలి అనుకున్నప్పుడు, ప్రాంతీయ సంస్కృతిని చిత్రించాలి అనుకున్నప్పుడు. కనుక అనువాదకుడు కూడా తన అనువాదంలో మాండలికాన్ని వాడవలసి వస్తుంది. ఏ మాండలికాన్ని ఎంచుకోవాలన్నది అనువాదకుడికి ఎదురయ్యే సమస్య. అప్పుడు మూల రచనలోని మాండలికానికి దగ్గరగా ఉన్న లక్ష్యభాషా మాండలికాన్ని అనువాదకుడు ఎంచుకోవలసి ఉంటుంది. ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం అనువాదాలలో మాండలికాల వాడకానికి కారణం మూల రచనలోని మాండలిక ప్రయోగం. మూల భాషా రచయిత మాండలికాన్ని వాడడానికి ఒక ప్రత్యేక ప్రయోజనం ఉండి ఉంటుంది. రచనలో మాండలికాన్ని ఎవరు వాడుతున్నారు అన్నది కూడా ప్రధానమే. కథకుడు లేదా ఇతర పాత్రలు ఏవైనా మాండలికాన్ని వాడవచ్చు. కథకుడు లేదా ప్రధాన పాత్రలు మాండలికాన్ని వాడినట్లయితే రచనలో మాండలికానికి ముఖ్యత్వం ఉన్నట్టు లెక్క. ఒక్కోసారి సామాజిక, ప్రాంతీయ, సమకాలీన అంశాలకు సంబంధించిన సమాచారాన్ని రచయిత మాండలికాలను వాడడం ద్వారా పాఠకుడికి పరోక్షంగా అందిస్తాడు. అంటే మాండలికం ఇక్కడ రచనలోని నేపథ్య చిత్రణకు(Background) పునాది అవుతుంది.

రచయిత వాస్తవిక సమాజ చిత్రణ చేయాలనుకున్నపుడు కూడా మాండలికాలను రచనలో వాడతారు. ఉదా: తెలంగాణ సమాజ చిత్రణ చేయాలనుకున్న దాశరథి రంగాచార్య తన చిల్లరదేవుళ్ళు నవలలో ఆ ప్రాంత మాండలికానికి ప్రాధాన్యం ఇచ్చారు. రచన మొత్తం మాండలిక భాషలో చేయడం ఆధునిక భారతీయ సాహిత్యంలో కనిపిస్తుంది. ఐరోపా, ఇతర పాశ్చాత్య దేశాల అధికశాతం రచనల్లో కొన్ని పాత్రలకు మాత్రమే మాండలిక భాషను పరిమితం చేశారు. ప్రమాణ భాష సూత్రాన్ని పాటించడం ఇందుకు కారణం కావచ్చు. "You will seldom find that writers show dialect consistently or in great detail" [రచయితలు మాండలికాన్ని నిరంతరాయంగానో లేక అధికంగానో వాడడాన్ని మీరు అరుదుగా చూస్తారు(Dennis Freeborn. 1986: 212-213). కొన్ని సార్లు రచయితలు భిన్న మాండలికాలను వాడడమూ కనిపిస్తుంది. అటువంటపుడు రచనలో వాటి ప్రాధాన్య క్రమాన్ని అనుసరించి అనువదించాలి. ప్రాముఖ్యం లేని పాత్రలు మాండలికాలను మాట్లాడినా అనువాదంలో వదిలివేయవచ్చు. పాశ్చాత్యులు మాండలిక అనువాదంలో మరొక పద్ధతిని కూడా చెప్పారు. అదే Literary Dialect. అంటే మూలంలో మాండలికం పాఠకుడికి కలిగించే భావనను తీసుకు రావడానికి అనువాదకుడు భాషలో, ఉచ్చారణలో మార్పులు చేస్తాడు. ఇక్కడ ఉపయోగించే మాండలికం పూర్తిగా అనువాదకుని సృష్టి. ఇదే సమయంలో మరొక అంశాన్ని గుర్తుంచుకోవాలి. మూల రచనలో మాండలికంలా కనిపించే భాష వాస్తవంగా వాడుకలో ఉన్న మాండలికానికి చెందిందా? లేక రచయిత కల్పించినదా? అన్న విషయం. మూలంలో Literary Dialect ఉన్నట్లయితే అటువంటి భాషను అనువాదకుడు కూడా తయారుచేయవచ్చు. అయితే మూల రచనలోని భాష ఇందుకు పునాది కావాలి. యూరోపియన్ భాషల్లోకి ఇతర భాషల మాండలికాల అనువాదం చాలా అరుదుగానే జరిగింది. దీనిని బట్టి పాశ్చాత్య అనువాదకులు మాండలికాలను అనువదించడానికి బదులు పూర్తిగా లక్ష్యభాషా రచనలో తొలగించారని చెప్పవచ్చు. ఇది సరైన అనువాదం అనిపించుకోదు. కన్యాశుల్కం నాటకాన్ని ఇంగ్లీషులోకి అనువదించిన వెల్చేరు నారాయణరావు మూలంలోని మాండలిక భాషకు ప్రాధాన్యం ఇవ్వకుండా Standard Englishలోకి అనువదించారు. అనువాదకుడు మూలరచనలోని మాండలికంతో సమానత కలిగిన లక్ష్యభాషా మాండలికాన్ని ఎంచుకోవాలి. సమానత ఉన్న లక్ష్యభాష మాండలికం అనడం వల్ల మూలభాష మాండలికాన్ని బాగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. మాండలికాలలోని రకాలు కూడా మాండలిక అనువాదాన్ని నిర్దేశిస్తాయి. ప్రాంతీయ, సామాజిక/వర్గ మాండలికాలు, వైయక్తిక మాండలికాలలో ప్రాంతీయ మాండలికాల అనువాదం మిగిలిన అన్నింటి కంటే కష్టం. మూలానికి తగ్గ ప్రాంతీయ మాండలిక స్వరూపం లక్ష్యభాషలో కొన్ని సార్లు దొరకకపోవచ్చు. అదే వర్గ మాండలికాల విషయానికి వస్తే సారూప్యత

గల మాండలికాలు రెండు భాషల మధ్య ఉండే అవకాశాలు ఎక్కువ. ఉదా: రైతులు మాట్లాడే మాండలికాన్ని రెండు భాషల్లోను గుర్తించి అనువదించుకోవచ్చు. మాండలికాన్ని మాట్లాడినంత సులభంగా రాతలోకి తీసుకు రాలేమన్నది పాశ్చాత్య రచయితలు ముఖ్యంగా ఇంగ్లీషువారి భావన. దీనికి కారణం వారి స్పెల్లింగ్ వ్యవస్థ. ప్రతి పదానికి ఖచ్చితమైన స్పెల్లింగ్ ఉండడం వల్ల ఉచ్చారణ మారినపుడు దానిని అనుసరించి స్పెల్లింగ్ ను మార్చడం వారికి కొంత కష్టమైన పని. ఉదా: A Tale of Two Cities నవలలో క్రంచర్ అన్న పాత్ర మాటలను చూడండి. "What d'ye mean?...What do you want to convey to your own father, you young Rip? (Page: 272). అలాగే Lady Chatterley's Lover నవలలో D.H. Lawrence వాడిన మాండలికం చూడండి. "Ah'm gettin' th' coops ready for th' young bods he said..." (Page: 125). పై వాక్యాలలో Do youను 'd'ye'గా రాయడం, I amను 'Ah'm'గా మాండలికాన్ని చిత్రించడానికే వాడారు. అలాగే పదాల చివరి అక్షరాలను తొలగించడం కూడా కనిపిస్తుంది. ఇది ఆయా మాండలికాల ఉచ్చారణను అనుసరించి చేసిన స్పెల్లింగ్. భారతీయ భాషలు ధ్వన్యాత్మక లిపిని అనుసరిస్తాయి కనుక ఇక్కడి రచయితలకు ఈ సమస్య లేదు.

## 4. మాండలిక అనువాదం – విధానాలు:

Sienkiewicz (1984: 239) మాండలిక అనువాదానికి సంబంధించి నాలుగు ప్రతిపాదనలు చేశారు.

- Image for Image Substitution: మూలంలోని మాండలికం ఏ అనుభూతిని కలిగిస్తుందో అటువంటి ప్రభావాన్ని కలిగించే లక్ష్యభాషా మాండలికాన్ని ఎన్నుకోవడం.
- Approximate Variety Substitution: మూల మాండలికానికి కొన్ని అంశాలలోనైనా సమానత కలిగిన లక్ష్యభాషా మాండలికాన్ని ఎన్నుకోవడం.
- Neutralization: మాండలికాన్ని వదిలి ప్రమాణ మాండలికంలోకి అనువదించడం.
- Amplification: మూల రచనలో లేకపోయినా అవసరం అనుకున్న చోట మాండలికాన్ని వాడడం.

మాండలిక అనువాదంపై పరిశోధన చేసిన Leszek Berezowski పది విధానాలను ప్రతిపాదించారు.

- Neutralization: మాండలికాన్ని వదిలి ప్రమాణ మాండలికంలోకి అనువదించడం.
- Lexicalization: మూలంలోని మాండలిక పదజాలానికి మాత్రమే పరిమితమైన అనువాదం.

- Partial Translation: మూలంలోని మాండలికం ఉచ్చారణను అనుసరించి లక్ష్యభాషను మాట్లాడడం.
- Transliteration: లిప్యంతరీకరణ
- Speech Defect: లక్ష్యభాషలో పాత్రల సంభాషణల్లో /భాషా ధ్వనులను అసహజంగా పలికించడం ద్వారా మూలంలోని మాండలిక అనుభూతిని కలిగించడం.
- Relativization: మాండలిక అనువాదాన్ని గౌరవార్థక పదాలు, ఉద్దేశిత పదాలకు పరిమితం చేయడం.
- Pidginization: మూలంలో పిడ్జిన్ ఉంటే అనువాదంలో కూడా పిడ్జిన్ ను వాడడం.
- Artificial Variety: లక్ష్యభాషలో సహజంగా లేని కొత్త మాండలికంలోకి మూల మాండలికాన్ని అనువదించడం
- Colloquialization: లక్ష్యభాషలో సహజంగా ఉన్న వాడుక భాషలోకి మూల మాండలికాన్ని అనువదించడం.
- Rusticalization: లక్ష్యభాషలోని ప్రాంతీయ మాండలికంలోకి మూల మాండలికాన్ని అనువదించడం. (Leszek Berezowski. 1997: 42-81).

## 5. తెలుగు అనువాద నవలల్లో మాండలికం:

తెలుగు అనువాద నవలల్లో మాండలిక భాషా ప్రయోగం విస్తృతంగానే జరిగింది. ఉదా: 1977లో ప్రసిద్ధ కన్నడ రచయిత శివరామకారంత్ రాసిన మరళి మణ్ణిగె" నవలను 'మరల సేద్యానికి' పేరుతో తిరుమల రామచంద్ర అనువదించారు. రచన అంతా సాఫీగానే వాడుక తెలుగులో జరిగినా అక్కడక్కడా అనంతపురం ప్రాంతపు తెలుగు మాండలిక పదాలు కనిపిస్తాయి. ఉదాహరణకు వడ్లవాడు(వడ్రంగి), పిటారీ(గాదె, గరిసె, కూటి), బొబ్బరుగుడి(మసీదు), ఎడనీరు(లేత కొబ్బరి నీళ్ళు) , కావలి కొప్పెర, ఆయకం(కుదువ), వేసరుకోవడం(విసుగు చెందడం), అంగళం(ముంగిలి) వంటివి. వీటిలో కొన్ని పదాలకు అనువాదకుడే అర్థాలను ఇచ్చారు. కొన్నింటిని పాఠకుడు సందర్భానుసారం అర్థం చేసుకోగలిగినా అర్థంకాని పదాలు ఇంకా కొన్ని ఉన్నాయి. ఉదా:కశ్చనగాడు, తలతగ్గించుకొనిరావడం, సవతిపైన పిల్ల. "అర్థం తెలియని మారుమూల పదాల నుపయోగించాలన్న కోరిక కొంతమంది కవుల కుండవచ్చునేమో కానీ నవలా రచయితకు ఉండకూడదు. అతడు నిత్య వ్యవహారంలోని పదజాలాన్ని, వాక్య నిర్మాణాన్ని ఉపయోగించవలసి ఉంటుంది"(వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994: 86). పాశ్చాత్య

నవలకు తొలి రూపంగా చెప్పే రాబిన్ సన్ క్రూసోలో కూడా మాండలిక ఛాయలు కనిపిస్తాయి. రాబిన్ సన్ దగ్గర పనిచేసే ఫ్రైడే పాత్ర ఈ మాండలికాన్ని మాట్లాడుతుంది. దీనిని మాండలికం అనడం కంటే పిడ్జిన్ (Pidgin)అనడం ఉత్తమం. పిడ్జిన్ అంటే వేరు వేరు భాషలు, సంస్కృతులకు చెందిన వ్యక్తులు ఒకచోట చేరినపుడు వారి మధ్య సంభాషణ కోసం రెండు భాషల్లోని పదాలను అవసరం మేరకు వాడుకోవడం వల్ల ఏర్పడిన భాష. ఉదా: "Why you angry mad with Friday what me done?" I asked him what he meant: I told him I was not angry with him at all. "No angry! No angry!" says he repeating the words several times. "Why send Friday home away to my nation?"(Daniel Defoe.1719: 361). తెలుగులో దీనికి అనువాదం వచ్చినప్పటికీ మాండలికానికి అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు.

90వ దశకంలో వచ్చిన అనువాద నవలల్లో మధురాంతకం రాజారాం అనువదించిన చిత్ర సుందరి నవలను పేర్కొనాలి. తమిళంలో అఖిలన్ రాసిన ఈ నవల జ్ఞానపీఠ పురస్కారాన్ని పొందింది. ఈ అనువాదంలో గ్రాంథిక, వ్యావహారికాలు కలిసి కనిపిస్తాయి. ఉదా: "కల్పనా కౌశలాని కిక్కడ అడ్డుకట్టలు వేయకపోవడం వల్ల ఎవరెవరి మనోధర్మాని కనుగుణ్యంగా వాళ్ళు బొమ్మలు గీస్తున్నారు"(రాజారాం, మధురాంతకం. 2014: 103). "ఆనంది అలాగే అవనతముఖిగా నిశ్చలంగా నిలబడిపోయింది" (రాజారాం, మధురాంతకం. 2014: 329). పరతెంచిపోవడం (పారిపోవడం), బిక్కరించడం, వేగిరించడం, పట్టైకాచినట్లు, అచ్చుకోవడం(పూచీ పడడం), అవాల్తాపడడం(పూచీ పడడం), నుగ్గునూచం చేయడం(పొడి పొడి చేయు) వంటి పదాలను పరిశీలించినపుడు రాయలసీమ మాండలికం ఉందని తెలుస్తుంది. ఈ పదాలు పాత్రల సంభాషణల్లోకాక రచయిత(ఇక్కడ అనువాదకుని) వర్ణనలు, వివరణల్లో కూడా కనిపిస్తున్నాయి.

రాజారాంగారు రాయలసీమ మాండలికంలో మంచి కథలు రాశారు. వారి భాషలో, రాతలో ఆ ప్రాంత మాండలిక ప్రభావం సహజమే. కానీ అనువాద రచనలో ఇటువంటి పదాల వాడకాన్ని ఏ మేరకు అనుమతించ వచ్చనేది పరిశీలించ వలసిన అంశం.

రచనలో మాండలికాన్ని ఎంత మేరకు వాడారు అన్నది కూడా పరిశీలించ వలసిన అంశమే. పాశ్చాత్య రచయితలు మాండలికాన్ని కొన్ని పాత్రలకే పరిమితం చేసి రచనలు చేశారు. ఛార్లెస్ డికెన్స్ రచన Hard Times కూడా ఈ కోవలోకే వస్తుంది. ఈ నవలలో స్టీఫెన్ బ్లాక్ పూల్ అన్న పాత్ర ద్వారా మాండలికం పలికించారు. స్టీఫెన్ ఆనాటి ఇంగ్లండులోని నిరక్షరాస్యులైన కార్మిక వర్గ మాండలికాన్ని మాట్లాడతాడు. పారిశ్రామిక విప్లవంతో ఇంగ్లండు ఉత్తర ప్రాంతాల్లో మిల్లు, గనుల పరిశ్రమలు వృద్ధి

చెందాయి. దీనితో కార్మిక వర్గము, ఆ వర్గానికి చెందిన భాషా వైవిధ్యమూ ఏర్పడ్డాయి. ఈ కార్మిక వర్గం పట్ల పాఠకులలో సానుభూతిని ఏర్పరచడానికి, పారిశ్రామికీకరణ వలన ఏర్పడ్డ సామాజిక వర్గ భేదాలను చిత్రించడానికి డికెన్స్ మాండలికాన్ని సాధనంగా వాడుకున్నాడు. ఉదా: I've tried a long time and 'ta'nt got better. But thou'rt right; 't might mak folk talk, even of thee. Thou hast been that to me, Rachael through so many year: thou hast done me so much good and heartened of me in that cheering way, that thy word is a law to me. Ah, lass and a bright good law! Better than some real ones." (Charles Dickens. 1850: 66).

"అవును రాషెల్. నీవు చెప్పింది నిజమే. ఆలోచించకుండా హాయిగా ఉండాలని ఎంతో ప్రయత్నించాను. కాని లాభం లేదు. అలా ఉండలేకపోయాను. మన నేస్తాన్ని గురించి ప్రజలు అనేక విధాలుగా ఆడిపోసుకున్నారు. అప్పుడు నీవు నన్ను ఎంతో ఓదార్చావు. నీ మాట నాకు పెట్టని కోట. శాసనం!– అన్నాడు స్టీఫెను!" (రామదాసు, బెల్లంకొండ. 2015: 58). మూలంలో కనిపించిన మాండలిక భేదాలు అనువాదంలో కన్పించడం లేదు. చాలా వరకు ప్రమాణ మాండలికంలోకి అనువదించారు.

మాండలిక భాష కనిపించే మరొక నవల రాబర్ట్ లూయిస్ స్టీవెన్ సన్ రాసిన Treasure Island. ఈ నవలలో సముద్రపు దొంగల మధ్య సాగే సంభాషణల్లో ఎక్కువగా మాండలికం కనిపిస్తుంది. ఇంగ్లండు నైరుతి ప్రాంతంలో మాట్లాడే మాండలికం ఇది. స్టీవెన్ సన్ దీనిని ఎంచుకోవడానికి చారిత్రక కారణమే ఉంది. పదిహేడవ శతాబ్దంలో అధికంగా సముద్రపు దొంగలు ఇంగ్లండు నైరుతి ప్రాంతాల నుండే వచ్చారు. అందువల్లనే నవల మొత్తంలో వారి మాండలికాన్నే వాడారు. ఉదా:

- "Ax your pardon, Sir, returned one of the men: 'you' are pretty free with some of the rules." (Robert Louise Stevenson. 267).
- Why did they want out? I dunno, but it's pretty plain they wanted it" (274).

పై వాక్యాలలో Askను Axగా, don'tను dunnoగా మాట్లాడడంలో మాండలిక లక్షణాలు కనిపిస్తాయి. నండూరి రామమోహన రావు 'కాంచనద్వీపం'గా ఈ నవలను తెలుగు చేశారు. ఇంగ్లీషులో కనిపించే మాండలిక ఛాయలేవీ తెలుగు అనువాదంలో కనిపించవు. ఒక్క లాంగ్ జాన్ సిల్వర్ పాత్ర మాత్రమే తస్సాదియ్య అన్న మాటను వాడతాడు. మిగిలిన నవల అంతా ప్రమాణ తెలుగు మాండలికంలో సాగుతుంది.

ప్రాంతీయ, సాంఘిక పునాదులు రెండిటి కలయిక వల్ల ఏర్పడిన మాండలికాలు అమెరికాలో కనిపిస్తాయి. అమెరికాలోని ఆఫ్రికా మూలాలున్న ప్రజల ఇంగ్లీషును ఇందుకు ఉదాహరణ చెప్పవచ్చు. ఈ మాండలికంలోని పాశ్చాత్య రచనల అనువాదాలు కూడా తెలుగులో కనిపిస్తాయి. ఎలెక్స్ హక్స్ లీ Roots నవలను ఏడు తరాలు పేరుతో సహవాసి, హారియట్ బీషర్ స్టోవే Uncle Tom's Cabin నవలను టామ్ మామ ఇల్లు పేరుతో దిగవల్లి వెంకటశివరావు, మార్గరెట్ మిచ్చెల్ రాసిన Gone with the Wind నవలను చివరకు మిగిలింది? పేరుతో ఎమ్. వి. రమణారెడ్డి, హోవార్డ్ ఫాస్ట్ Freedom Road నవలను స్వేచ్ఛాపథం పేరుతో రంగనాయకమ్మ, Spartacus నవలను అదే పేరుతో ఆకెళ్ళ కృష్ణమూర్తి తెలుగు చేశారు. మొదటి మూడు నవలలు ఒకే కాలాన్ని, ప్రాంతాన్ని చిత్రించే నవలలు. అమెరికా అంతర్యుద్ధ సమయంలోనూ అది గడిచిన తరువాత ఏర్పడిన పరిస్థితులను ఈ నవలలు చిత్రిస్తాయి. బానిసలుగా అమెరికాలో బతుకుతున్న ఆఫ్రికన్లు/నల్లవారి జీవితాలను చిత్రించిన నవలలు ఇవి. బానిసలకు చదవడం, రాయడం అనేవి ఆ కాలంలో నిషిద్ధాలు. అందువల్ల వారి ఇంగ్లీషు ఒక కొత్త మాండలికాన్ని తయారు చేసింది. టామ్ మామ ఇల్లులో టామ్, హేలీ, ఏడుతరాలు నవలలో ఫిడేలయ్య, చివరకు మిగిలేది?లో మామీ పాత్రలను ఇటువంటి మాండలికానికి ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ మాండలికం అమెరికా దక్షిణ రాష్ట్రాలలోని ఇంగ్లీషు భాష నుండి ఏర్పడింది. African American Vernacular English (AAVE)గా పైలిచే ఈ మాండలిక పుట్టుకకు సబంధించి భిన్న వాదాలు ఉన్నాయి. పై నవలలను తెలుగు చేసిన అనువాదకులందరూ ఈ మాండలికాన్ని నిరక్షరాస్యుల మాండలికంగానే అనువదించారు. ఉదా: "I foun' out, she told him one day, "dat massa done writ out a will that if he die an' ain't got married, his slaves gon' go to little Missy Anne. But de will say if he do marry, den he wife would git us slaves when he die"(Alex Haley. 1992: 320).

"నీకీ సంగతి తెలుసో లేదో! అయ్య వీలునామా రాశాడంట, తను మళ్ళీ పెళ్ళాడకుండా చనిపోతే తన బానిసలంతా మిస్సీ ఆనీ ఆస్తవుతారని అందులో రాశాడంట! పెళ్ళాడితే మనమంతా అతని భార్యకి దక్కుతామంట!" (సహవాసి. 2017: 106).

పై అనువాదంలో సహవాసి చేసిన వాడిన మాండలికం ఏ ప్రాంతానికీ చెందింది కాదు. ఒక రకంగా ఈ మాండలికాన్ని అనువాదకుడే తయారుచేసి వాడారు. అందువల్ల దీనిని Literary Dialect(సాహిత్య మాండలికం)గా పరిగణించవలసి ఉంటుంది.

ఒక్క రమణారెడ్డిగారు మాత్రం చివరకు మిగిలింది? లో రాయలసీమ మాండలికాన్ని వాడారు. అయితే ఆయన వాడిన కొన్ని పదాలు కొన్ని ఇతర ప్రాంతాల వారికి తెలిసే అవకాశం లేదు. ఉదా: ఉరువులు(దేవుని కైంకర్యమునకై వినియోగించు వస్తు సామగ్రి), అంబేద, కొతుకు(సంకోచంతో మాట్లాడడం, వర్ణలోపంతో మాట్లాడడం), కుద్దుగా(స్వయంగా), నెరసుకోవడం(తిట్టుకోవడం) వంటివి. విభక్తి ప్రత్యయాలను కూడా రాయలసీమ, తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో వాడే భాష ఆధారంగా వాడారు. ఉదా: "ఒక్క నిమిషం ఇలా వచ్చి నా పక్కలో కూర్చోండి(రమణారెడ్డి, యం. 2012: 416)."ఆమె పక్కలో ఆప్యాయమైన చిరునవ్వుతో నిలబడివుంది మెలనీ" (రమణారెడ్డి, యం. 2012: 112). పుస్తకం చివరనైనా అనువాదకుడు పాఠకులకు కొత్త అనిపిస్తాయన్న పదాలకు అర్థ వివరణలు ఇచ్చి ఉండవలసింది. నవల మధ్యలో ఒకే ఒక చోట బ్లాక్ మెయిల్ పదానికి వివరణ ఇచ్చారు. అది నేడు చాలా మంది తెలుగు వారికి తెలియని పదం కాదు.

తెలుగు మాదిరిగానే తమిళ భాషలోను అనేక మాండలికాలు ఉన్నాయి. బట్టికలోవ(మట్టక్కళప్పు పేచ్చు తమిళ్), బ్రాహ్మణ, మధ్య, కొంగు, కుమరి, అయ్యంగార్, మద్రాసు, మధురై, తిరునల్వేలి, నిగుమ్బో, సంకేతి వంటి మాండలికాలు ఉన్నాయి. పాత్రోచితంగా ఆయా మాండలికాలను రచనలో వాడుకున్న రచయితలు తమిళంలోనూ కనిపిస్తారు. ఉదా: జయకాంతన్ తమిళంలో రాసిన ఒరు నడిగై నాడగం పార్కిరాళ్(ఒక నటి నాటకం చూస్తున్నది) నవలను తెలుగులో కళ్యాణి పేరుతో జిళ్ళేల్ల బాలాజీ అనువదించారు. చాలా వరకు పాత్రలు మద్రాసు మాండలికంలో సంభాషిస్తే అణ్ణాసామి(తెలుగులో ఆనందరావు) బ్రాహ్మణ మాండలికంలో సంభాషిస్తాడు. ఉదా: கல்யாணீ! நான் இவரை உனக்கு அறிமுகப்படுத்தி வைக்கணும். மிஸ்டர் ...ரங்க! மன்னிச்சுக்குங்க ஸார். நம்ப எனிமி நெம்பர் ஒன். அதுக்காக நான் கொஞ்செம் ஓவரா சத்தம் போட்டுட்டேன். ஐ யாம் ஸாரீ மிஸ்டர் ரங்கா! நீங்க இருந்து நாடகம் பார்துவிட்டுத்தான் போகணும். நீங்க திட்டுங்கோ. அதனாலே பரவாயில்லை. ஆனால் நாடகம் பார்துட்டுப் போங்கோ(కల్యాణీ! నాన్ ఇవరై ఉనక్కు అరిముగప్పదుత్తి వైక్కణుమ్. మిస్టర్ రంగా! మన్నిచ్చుకుంగ సార్. నంబ ఎనిమీ నెంబర్ వన్. అదుక్కాగ దాన్ కొంజెమ్ ఓవరా చత్తమ్ పోట్టుట్టేన్. ఇ యామ్ సారీ మిస్టర్ రంగా. నీంగ ఇరుందు నాడగం పార్తువిట్టుత్తాన్ పోగణుమ్. నీంగ తిట్టుంగో. అదనాలే పరవాఇల్లై. ఆనాల్ నాడగం పాత్తుట్టు పోంగో) (ஜயகாந்தன். 2002:32).

కళ్యాణీ నేను ఈయన్ను నీకు పరిచయం చేయాలి. ఇతను మిస్టర్...దివాకర్(తమిళంలో రంగా ఇక్కడ దివాకర్ అయ్యాడు) మన ఎనిమీ నెంబర్ వన్. అందుకే నేను కాస్త ఓవర్ గా మాట్లాడేశాను. అయామ్ సారీ మిస్టర్ దివాకర్. మీరు చివరి వరకు ఉండి నాటకం చూసే వెళ్ళాలి. మీరు ఎన్నైనా తిట్టండి,

అయినా ఫరవాలేదు, కానీ నాటకం చూసే వెళ్ళాలి-(బాలాజి, జిళ్ళేల్ల. 2006: 09). తెలుగులో ఇటువంటి మాండలికం లేదని చెప్పలేము కాని సాహిత్యంలో నేడు వాడుకలో లేదు. బహుశా ఈ కారణం వల్లనే అనువాదకుడు ప్రమాణ మాండలికంలోకి అనువదించాడు.

మార్క్ ట్వేన్ హకెల్ బెరిఫిన్ నవలలో చాలా పాత్రలు మాండలికంలో సంభాషిస్తాయి. ఈ నవలను నండూరి రామమోహన రావు తెలుగు చేశారు. మూలంలో కనిపించినన్ని మాండలిక భేదాలు అనువాదంలో కనిపించవు. తెలుగులో ఇంకా రెండు మహానగరాలు, హారీపోటర్, మొపాసా కథలు, మృతజీవులు(నికొలాయ్ గొగోల్ నాటకం) వంటి అనువాద రచనల్లో మాండలిక ఛాయలు కనిపిస్తాయి. మొత్తం మీద ఈ రచనలను పరిశీలించినపుడు తెలుగు నవలానువాదకులు మాండలికాల అనువాదంలో ప్రధానంగా మూడు పద్ధతులను పాటించారని చెప్పవచ్చు. ఒకటి మాండలికాన్ని వదిలి ప్రమాణ మాండలికంలోకి అనువదించడం. రెండు అనువాదకుడు కొత్త సాహిత్య మాండలికంతో మూల మాండలికాన్ని అనువదించడం. మూడు మూల భాష మాండలికానికి దగ్గరగా ఉందనుకున్న లక్ష్యభాష మాండలికంలోకి అనువదించడం. తెలుగు అనువాదాలలో ఈ మూడో ప్రక్రియ అంత ఎక్కువగా జరగలేదు. మాండలిక అనువాదానికి పూనుకునే ముందు అనువాదకుడు మూలరచన మాండలికాన్ని అర్థం చేసుకోవడమే కాక మూలానికి తగ్గ లక్ష్యభాష మాండలికాన్ని ఎంచుకోవాలి. అంటే లక్ష్యభాషలో ఉన్న వివిధ మాండలికాలను అనువాదకుడు పరిశీలిలించాలి. అయితే అన్ని మాండలికాలను అవగాహన చేసుకోవడం ఎవరికైనా సాధ్యమయ్యే పనికాదు. ఇందుకోసం మాండలిక పదకోశాలను తయారు చేసుకోవలసిన అవసరం ఉంది. ఇతర సాహిత్య ప్రక్రియలైన కవిత్వం, కథ, నాటకం మొదలైన వాటిలో మాండలిక అనువాద విధానాలపై మరింత పరిశోధన జరగవలసిన అవసరం ఉంది.

## 6. వాడుకున్న పుస్తకాల పట్టిక:


1. బాలాజి, జిళ్ళేల్ల.2006. ***కళ్యాణి.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

2. మార్గరెట్ మిట్చెల్, రమణారెడ్డి, ఎం.వి. (అనువాదకుడు).2012. ***చివరకు మిగిలింది?***, పొద్దుటూరు: కవితా పబ్లికేషన్స్

3. రామచంద్ర, తిరుమల. 2008. ***మరల సేద్యానికి.*** హైదరాబాదు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్

4. రామచంద్రారెడ్డి, రాచమల్లు. 2011. ***అనువాద సమస్యలు.*** హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

5. రాజారాం, మధురాంతకం. 2012. ***చిత్రసుందరి***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

6. రామదాసు, బెల్లంకొండ. 2015. ***కలికాలం***. నరసరావు పేట. బెల్లంకొండ రామరాయ కవీంద్రుల ట్రస్ట్

7. రామమోహన రావు, నండూరి. 2006. ***కాంచన ద్వీపం***. విజయవాడ: అభినందన పబ్లిషర్స్

8. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. 1994. ***నవలా శిల్పం***. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్

9. సహవాసి. 2017. ***ఏడుతరాలు.*** హైదరాబాదు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్

10. ஜயகாந்தன். 2002. ***ஒரு நடிகை நாடகம் பார்க்கிறாள்***. மதுரை: மீனாட்சி புத்தக னிலையம்

11. Catford, J.C. 1978. ***A Linguistic Theory of Translation: An Essay in Applied Linguistics***. London: Oxford University Press

12. Charles Dickens. 1850. ***Hard Times***. http://en.wikisource.org

13. Cuddon, J. A., Habib, M. A. R. 2015. ***Dictionary of Literary Terms and Literary Theory: Fifth Edition.*** New Delhi: Penguin Publishing Group.

14. Daniel Defoe.1791. ***Robinson Crusoe***. http://www.planetpdf.com

15. Dennis Freeborn (Editor), David Langford, Peter French. 1986. ***Varieties of English: An Introduction to the Study of Language.*** London: Macmillan Education Ltd.

16. Haley, Alex. 1991. ***Roots***. London: Vintage Books

17. Leszek Berezowski. 1997. ***Dialect in Translation.*** Wroclawskiego: Wydawnictoo University

18. Robert Louis Stevenson. ***Treasure Island***. http://www.planetpdf.com

**Web Links:**

19. https://en.oxforddictionaries.com/definition/dialect